# గట్టున మేంధని...

-టి.చంద్రశేఖరరెడ్డి

జీపులో టూర్‌కి వెళ్తున్నాను. రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. జీపు కదిలిన కాసేపటికే కళ్లు మూతలుపడడం మొదలయింది. కానీ ముందు సీట్లో కూర్చుని నిద్రపోతే నా వాహన చోదకుడు సుతరామూ ఒప్పుకోడు. తనకు కూడా నిద్ర వస్తుందంటాడు. అతడు నిద్రపోతే ఏముంది...? ఇక లేవని నిద్రే ఇద్దరికీ.

అందుకే బలవంతాన నిద్రని ఆపుకునే ప్రయత్నం చేస్తున్నాను. నా ప్రయత్నానికి సహకరించడానికా అన్నట్లు జేబులో మొబైల్ మ్రోగింది.

నెంబర్ చూసాను. తెలిసిన నెంబరుకాదు. సిగ్నల్ కూడా సరిగ్గాలేదు. జీపుని ప్రక్కకి తీసి ఆపమని కిందకు దిగాను. ఇప్పుడు సిగ్నల్ పూర్తిగా వుంది. కాల్ ఆన్సర్ చేసాను.

"హలో'' అటువైపు నుంచి పరిచితమైన గొంతు వినబడింది. అది కాంతారావు గారిది.

"నమస్తే సార్. బాగున్నారా?'' విష్ చేసాను.

"రెడ్డిగారూ! గుర్తుపట్టారా? నేను కాంతారావును. ఖమ్మంలో మనిద్దరం కలసి పని చేసాం. ఎలాగున్నారు?'' అటువైపునుంచి కాంతారావు గారి గొంతు గంట కొట్టినట్లుగా వినబడుతోంది.

బాగా పెద్దగా మాట్లాడడం ఆయనకు అలవాటు. ఒక్కోసారి అనిపిస్తూ వుంటుంది కొందరికి ఫోను వేస్తేమోనని. మరికొంచెం గట్టిగా మాట్లాడితే ఫోను అవసరం లేకుండానే అటువైపు వాళ్లకి వీళ్లు చెప్పదల్చుకున్నది వినబడుతుందికదాని.

"సార్! గుర్తు పట్టబట్టేగా మీకు విష్ చేసింది'' మర్యాదగా జవాబిచ్చాను.

"చిన్న పనిమీద ఫోన్ చేసాను. రెండు నిముషాలు మాట్లాడవచ్చా?''

"చిన్న పని గురించేకాదు, పెద్దపని గురించయినా మీరు ఫోన్ చేయవచ్చు. రెండు నిముషాలు కాకపోతే అయిదు నిమషాలు మాట్లాడండి.''

"ఏంలేదు. మా పెద్దవాడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాను. సరైన సంబంధం దొరకడంలేదు. వాడికి ఉద్యోగం లేదుగా. ఇంజనీరింగ్ అత్తెసరు మార్కులతో పాసయ్యాడు. ఏదో ప్రయత్నాలు చేస్తున్నాడు. కానీ ఎక్కడా ఉద్యోగాలు దొరకడం లేదు. వాడికీ ముప్ఫయి సంవత్సరాలు దాటాయి. ఇంకా కొద్దిరోజులు పోతే అసలు పెళ్లి కాదేమోనని అనుమానంగా ఉంది.''

"ఉద్యోగం లేనివాడు భార్యనెలా పోషిస్తాడు? సంసార సాగరాన్ని ఎలా ఈదుతాడు?'' అదే విషయాన్ని అడిగాను కాంతారావుగారిని.

"వాడికి ఉద్యోగం లేకపోతేనేం? వాడి భార్యకు ఉద్యోగం ఉన్నా సరిపోతుందిగా'' ఆయన గొంతులో లౌక్యం ధ్వనించింది.

అయితే ఉద్యోగం ఉన్న అమ్మాయికోసం వెదుకుతున్నాడన్నమాట.

"అవుననుకోండి. కానీ ఉద్యోగం ఉన్న అమ్మాయి ఉద్యోగం లేనివాడిని చేసుకోవడానికి ఇష్టపడవద్దు'' నా మనసులో వున్న అనుమానం వ్యక్తపరిచాను.

"కట్నం ఏమీ లేకుండా చేసుకుంటానంటే కూడా ఒప్పుకోదా?''

ఉద్యోగం లేనివాడికి ఉద్యోగం లేని అమ్మాయిని ఇవ్వడానికి ఏ తల్లీదండ్రీ ఇష్టపడడంలేదు. అలాంటిది ఉద్యోగం వున్న అమ్మాయిని ఇవ్వడానికి ఎవరు ఇష్టపడతారు? కట్నకానుకలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా పెళ్లవుతుందని అమ్మాయి తల్లీదండ్రీ ఒప్పుకున్నా ఆ అమ్మాయి ఒప్పుకోవద్దూ?

"ప్రయత్నం చేస్తే ఎవరైనా దొరుకుతారేమో'' సంభాషణ కొనసాగించడానికన్నట్లు అన్నాను.

"హమ్మయ్యా... నా దారికి వచ్చారు. ఆ ప్రయత్నం ఏదో మీరే చేయాలి'' కాంతారావు గారి గొంతులో ఆనందం తొణికిసలాడింది.

"చెప్పండి ఏం చేయాలో?''

"మనతోపాటు పని చేసిన రామారావుకి ఇద్దరూ ఆడపిల్లలే. గుర్తుందిగా?''

"గుర్తులేకపోవడమేమిటి? ఇప్పుడు నేనూ అతనూ ఒక ఆఫీసులోనే పనిచేస్తోంది. అతడు నా క్లాస్‌మేట్ కూడా''

"వాళ్ల పెద్దమ్మాయి ఎమ్‌సిఏ పూర్తి చేసింది. రెండో అమ్మాయికి విప్రోలో జాబ్ వచ్చింది. అవునా''

"అవును''

"రెండో అమ్మాయికి మా అబ్బాయిని మాట్లాడదామని నా ఆలోచన. ఆ మాటలేదో మీరు అతడితో మాట్లాడితే బావుంటుందని నా నమ్మకం.''

"కానీ పెద్దమ్మాయికి పెళ్లి కాకుండా రెండో అమ్మాయి పెళ్లి గురించి నేను మాట్లాడడం...'' ఆగిపోయాను.

"ఆ అనుమానం మీకొస్తుందని నాకు తెలుసు. పెద్దమ్మాయికి పెళ్లి సంబంధం నేను చూసాను. వాళ్లు ఒప్పుకుంటే రెండూ ఒకేసారి చేయవచ్చు.''

"ఆలోచన బాగుంది. పెద్దమ్మాయికి మీరు చూసిన సంబంధం ఎక్కడిది?''

"బయట సంబంధం కాదులెండి. మా తోడల్లుడి అబ్బాయే. అమెరికాలో ఎమ్ఎస్ చేసి మంచి పొజిషన్‌లో ఉన్నాడు. జీతం కూడా ఎక్కువే. ఆ అబ్బాయికి బిటెక్ లేదా ఎమ్‌సిఏ చేసిన అమ్మాయి కావాలిట. అమ్మాయి అందంగా ఉండి బ్రిలియంట్ అయివుంటే చాలుట. మిగిలిన వాటి గురించి పెద్ద పట్టింపులు లేవు. ఉన్నా వాటిని నేను సర్దుబాటు చేస్తాను.''

కాంతారావుగారి మాటలు వింటున్న నేను విస్తుపోయాను.

"సరే. రామారావుని కదిలించి చూస్తాను. ఏ విషయం మీకు ఒకటి రెండురోజుల్లో చెబుతాను"

"ఏ విషయం కాదు. పండని చెప్పాలి. కాయ అయితే నేను ఒప్పుకోను" కాంతారావుగారి నవ్వు మళ్ళీ.

నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు నాకు. గుడ్‌బై చెప్పి మొబైల్ ఆఫ్ చేసాను.ఇప్పుడు ఆలోచన పడబోయే పాట్ల గురించి, కునికిపాట్లు గురించి కాదు. జీపులో కూర్చున్నాను. ప్రయాణం మళ్లీ మొదలయింది. శరీరానికే కాదు, మనసుకు కూడా!

★★★


"నో అని చెప్పలేకపోయాను. కొంచెం ఆలోచించాలి అని తప్పుకున్నాను.

"ఏమన్నా ఆలోచించావా?" అడిగాను.

అతను ఏం ఆలోచించేది నాకు తెలుసు. కానీ అతని ద్వారా తెలుసుకుందామని అడిగాను.

"ఆలోచించడమేకాదు, నేను ఆలోచించినదంతా నీకు వివరిస్తాను. తరువాత నా ఆలోచనా సరళి సరిగ్గా ఉందా లేదా అన్న విషయం మీద నీ అభిప్రాయం నిస్సంకోచంగా చెప్పాలి. ఎలాంటి దాపరికం ఉండకూడదు. సరేనా?"

"ఏ తండ్రయినా తన సంతానం అంతా సమాన స్థాయిలో అభివృద్ధి చెందాలని కోరుకుంటాడు. నేను దానికి మినహాయింపు కాదు. పెద్దమ్మాయి సునీతకు ఉద్యోగం లేక పోవచ్చు. చిన్నది



సుమతికి ఉద్యోగం వచ్చి ఉండవచ్చు. నాకున్నది వాళ్లిద్దరే. మగపిల్లలు లేరు కనుక ఉన్నదంతా వాళ్లిద్దరిదే. అవునా?"

"కరక్టే."

"సునీతకి ఉద్యోగస్థుడిని మాట్లాడి సుమతిని ఉద్యోగంలేని వాడికి ఇవ్వాలనుకోవడం, ఇద్దరు కూతుళ్లనీ అసమానంగా చూసినట్లు కాదా?"

నేనేం మాట్లాడలేకపోయాను.

"సునీతకి మాట్లాడేది అమెరికా సంబంధం. సుమతికి మాట్లాడదలచుకున్నది ఇండియా సంబంధం. అలా చూస్తే పెద్దదానికి న్యాయం జరగవచ్చు. కానీ నేను తెలిసి చిన్నదానిని తక్కువ చేసినట్లుకాదా?"

తరువాతి రోజు హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉన్నాను. లంచ్ అవర్‌లో కాంతారావుగారి ప్రపోజల్ గురించి రామారావు దగ్గర ప్రస్తావించాను.

విన్న తరువాత రామారావు కాసేపు ఏమీ మాట్లాడలేదు. అతడి ముఖ కవళికలు చూస్తుంటే నాకు బాధగా అనిపించింది. ఎందుకు ఈ విషయం ఎత్తానా? అని ఫీలయ్యాను.

"సారీ రామారావ్! ఈ సంభాషణ నీకు రుచించలేదుగదూ"

"అలాంటిదేంలేదు. కానీ ఈ ప్రస్తావన ఇంతకుముందు నా దగ్గరకు డైరెక్టుగా వచ్చింది. ఇప్పుడు నీ ద్వారా వచ్చింది. అంతకుమించి తేడా ఏంలేదు."

"డైరెక్టుగా ప్రస్తావించినప్పుడు నువ్వేమన్నావ్?"

నా దగ్గర జవాబులేదు.

"రెండోదాన్నికట్నకానుకలు లేకుండా తన పెద్ద కొడుక్కు చేసుకోవడానికి కాంతారావుగారికి అభ్యంతరం లేకపోవచ్చు. కానీ నా చిన్న కూతురు, అక్కయ్యకి ఎంతో కొంత ఇచ్చారు, నన్ను మాత్రం పైసా ఖర్చు లేకుండా వదిలించుకున్నారు అని అనుకోదా?"

"నిజమే! ఏమీ లేకుండా వెళితే తనకి ఉండాల్సినంత విలువ ఉండకపోవచ్చు అత్తవారింట్లో"

అంగీకరించాను.

"అదీకాక ఉద్యోగం ఉన్నవాడిని చేసుకోవడానికి సునీత అంగీకరించవచ్చు. కానీ ఉద్యోగం లేనివాడిని సుమతి ఇష్టపడవద్దూ"

రామారావు గొంతులోంచి మాటలు తూటాల్లా బయటకు వస్తున్నాయి.

రామారావు దగ్గర్నుంచి ఈ రీజనింగ్ నేను ఊహించాను. అతడు బాధ్యతగల తండ్రిగా తనవైపు నుంచే కాక ఆడపిల్లల వైపు నుంచి కూడా కరెక్టుగా ఆలోచించాడు.

అతడి సంగతి ముందు నుంచీ తెలిసి ఉన్న నేను అందుకే పెద్దగా ఆశ్చర్యపోలేదు.

★★★

ఛాంబర్‌లో కూర్చుని ఫైల్స్ చూస్తున్నాను.

మొబైల్ మ్రోగింది.

నెంబర్ చూసాను.

తెలియని నెంబర్. కాల్ ఆన్సర్ చేసాను.

"నమస్తే అంకుల్" అటువైపు నుంచి ఓ యువకుడి కంఠస్వరం వినబడింది.

"నమస్తే... ఎవరూ?" గొంతు గుర్తు పట్టక అడిగాను.

"నేనంకుల్. కాంతారావుగారి అబ్బాయిని."

తండ్రిది అయిపోయింది. ఇక కొడుకు వైపునుంచి మొదలయిందన్నమాట వత్తిడి. మనసులో అనుకున్నాను.

"మీరనుకున్నట్లుగా మాట్లాడడానికి నేను ఫోన్ చేయలేదు అంకుల్"

నేనేం అనుకుంటున్నానో శ్రీకాంత్‌కి ఎలా తెలుస్తుంది? తెలివిగలవాడిలా ఉన్నాడే!

అయినా బింకానికి "నేనేం అనుకోవడంలేదు కానీ నువ్వు చెప్పదలచుకున్నది చెప్పు" అన్నాను.

"డాడీ మొన్న మీతో మాట్లాడినదంతా విన్నానంకుల్. కానీ ఆయన ఆలోచన నాకు నచ్చలేదు. నా దగ్గర ముందుగా ఈ ప్రపోజల్ పెడితే నేను వద్దనేవాడిని."

"ఏం?"

"ఉద్యోగం లేకుండా పెళ్లి చేసుకోవడం, భార్య సంపాదన మీద బ్రతకడం నాకు నచ్చని పని అంకుల్"

చిత్రంగా అనిపించింది శ్రీకాంత్ ఆలోచనా ధోరణి.

"అలా బ్రతకడంలో సుఖం వుండవచ్చు. కానీ తృప్తి ఉండదు. ఆత్మనూన్యతాభావంతో అనుక్షణం జీవించడం నాకు రుచించదు అంకుల్."

"సంతోషం. కానీ ఎన్నాళ్లిలా పెళ్లి కాకుండా ఉంటావ్?"

"పెళ్లికన్నా నాకు ఉద్యోగం ముఖ్యం అంకుల్. ఉద్యోగం లేకపోవడం వల్ల పెళ్లి కావడం లేదు అన్న ఆలోచన ఉన్నన్నాళ్లూ ఉద్యోగ ప్రయత్నం చేస్తూనే వుంటాను. కానీ ఉద్యోగం లేకుండానే పెళ్లి అయితే దానిలో సుఖానికి అలవాటుపడి ఇక జీవితాంతం నిరుద్యోగికానే మిగిలిపోతాను. ఉద్యోగం కోసం ప్రయత్నం చేయాలన్న మోటివేషన్ అప్పుడు ఉండదు. నిరుద్యోగ వివాహితుడిలా ఉండడంకన్నా అవివాహిత నిరుద్యోగిలా ఉండడం ఎక్కువ గౌరవప్రదం కదా అంకుల్" అతడి మాటల్లో నిశ్చితమయిన అభిప్రాయం.


"వండర్‌ఫుల్. కానీ నీ మనసులో మాట నాన్నగారికి చెప్పావా?"

"చెప్పాను అంకుల్. పితృప్రేమ అంత తొందరగా అంగీకరించనివ్వలేదు. కానీ కన్విన్స్ చేయగలిగాను. ఆయన ఈ విషయం మీద ఇక మీకు ఫోన్ చేయరు. ఉంటానంకుల్"

మొబైల్ ఆఫ్ అయింది.

ఆవు గట్టుమీద మేస్తే దూడ చేలో మేస్తుందా? అని సామెత. ఆ సామెతకు భిన్నంగా ఆలోచిస్తున్న శ్రీకాంత్ ఆలోచనారీతి నేటి యువతరం అందరికీ ఉంటే...?

★



## సన్నబడిన విష్ణు

హీరోయిన్లే కాదు, హీరోలు కూడా స్లిమ్‌గా తయారవడం అనేది ఇప్పుడు ఫ్యాషనైపోయింది. సాధారణమైపోయింది. నిన్న జూనియర్ ఎన్టీఆర్ కిలోలకొద్దీ బరువు తగ్గాక అప్పుడే రెండు సినిమాలు రిలీజయ్యాయి కూడా. తాజాగా మోహన్‌బాబు కుమారుడు విష్ణు స్లిమ్‌గా మారాడు. స్లిమ్‌గా మారిన విష్ణుని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాల్సిందే మరి!

